క్లుప్తంగా

ఆడిటర్ ఆదిత్యశర్మకు చాగంటి పురస్కారం



ఆదిత్యశర్మ దంపతులకు పురస్కారం అందజేస్తున్న చాగంటి

కాకినాడ రూరల్: ధార్మిక, సేవా రంగంలో సేవలందిస్తున్న కాకినాడకు చెందిన ప్రముఖ ఆడిటర్ ఆదిత్య శర్మకు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు తన తల్లిదండ్రుల పేరున ధర్మానుష్ఠాన వరిష్ఠ బిరుదు ఇచ్చి, శ్రీచాగంటి పురస్కారంతో ఘనంగా సత్కరించారు. తిమ్మాపురం గ్రామంలో ఆకుండి లక్ష్మి స్మారక గోశాలలో బుధవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఆదిత్య శర్మ దంపతులను సన్మానించారు. బ్రహ్మశ్రీ చాగంటి మాట్లాడుతూ, ఆదిత్య శర్మ కాకినాడ భారతికి అధ్యక్షుడిగా విశేష సేవలందించారని, ఆనంద నిలయం పేరుతో 120 మంది ఎస్సీ, బీసీ విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. పురస్కార గ్రహీత ఆదిత్యశర్మ మాట్లాడుతూ, ఈ పురస్కారం అందుకోవడం జీవితంలో మరువలేనన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వరలక్ష్మి

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని కొత్తూరు అంగన్ వాడీ సెంటరు ప్రాంతంలోని వృద్ధులకు నారాయణ సేవ అధ్యక్షురాలు ఎం.వరలక్ష్మి బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. శీతాకాలం, తుపాన్ల ప్రభావంతో చలిగాలులతో పాటు, చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో వృద్ధులకు తనవంతు సాయంగా దుప్పట్లు పంపిణీ చేసినట్టు వరలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు బుద్దరాజు సత్యనారాయణ రాజు, మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్త అనురాధ, తదితరులు పాల్గొన్నారు.


వైభవంగా మన్యుసూక్త హోమం

బోట్‌క్లబ్: రాజమహేంద్రవరం ఉత్తరాది మఠాధికారి విజయ సింహాచార్, విక్రమాచార్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రామారావుపేటలోని మధ్వసభలో మన్యుసూక్త హోమం వైభవంగా నిర్వహించారు. సుసర్ల చలపతిరావు స్వీయ పర్యవేక్షణలో ఆధ్యాత్మిక ప్రవచనాలు, శాంతి హోమాలు జరిగాయి. ఈ సందర్భంగా విజయ సింహాచార్ మాట్లాడుతూ, మార్గశిర మాసంలో జ్ఞాన యజ్ఞ కార్యక్రమం నిర్వహించడం భగవంతునికి ప్రీతికరమన్నారు. మధ్వ భక్తులు ఈ విశేస కార్యక్రమాల ద్వారా ఆధ్యాత్మిక ఆనందాన్ని, భగవంతుడి అనుగ్రహాన్ని పొందామని ప్రకటించడం గొప్ప విషయమన్నారు. సుసర్ల చలపతిరావు మాట్లాడుతూ, కాకినాడ మధ్వసభ కమిటీ ఆధ్వర్యంలో ఈ హోమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం పండితులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మధ్వసభ కమిటీ కార్యదర్శి కోపల్లె శేషగిరిరావు, సభ్యులు ఆనందరావు, రాచూరి శేషగిరిరావు, జమ్మి కృష్ణారావు, ఉదయగిరి శేషగిరిరావు పాల్గొన్నారు.

సమాచారం

పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల	0884-2379480
జేఎన్‌టీయూ కళాశాల	0884-23800823
జిల్లా ఉపాధి కార్యాలయం	0884-2373270
ఐటీఐ కళాశాల	0884-2348182
ఏయూ దూరవిద్యాకేంద్ర	0884-2383788
జిల్లా రవాణాశాఖాధికారి	9154294104
జిల్లా విద్యాశాఖాధికారి	9849909104
స్కిల్ డవలప్‌మెంట్ కార్యాలయం	8500885866

కాకినాడ సినిమాలు



ఆనంద్ సినిమాస్:	బేబీ జాన్, పుష్ప-2, ముఫాసా, బరోస్
దేవీ మల్టీప్లెక్స్:	పుష్ప-2, ముఫాసా, విడుదల-2, యుఐ
సత్యగౌరి:	ముఫాసా
తిరుమల:	బచ్చలమల్లి
సీఅండ్‌సీ:	శ్రీకాకుళం షెర్లాక్‌హోమ్స్, ముఫాసా
శ్రీప్రియ:	ముఫాసా
పద్మప్రియ:	పుష్ప-2

నిర్లక్ష్యానికి మూల్యం.. డెంగీ జ్వరం..

- సీజన్ దాటినా తగ్గని కేసుల ఉధృతి
- పారిశుధ్య లోపమే ప్రధాన కారణం
- పట్టించుకోని నగరపాలక యంత్రాంగం
- సత్ఫలితాలివ్వని వైద్యారోగ్య శాఖ చర్యలు



కాకినాడ-సామర్లకోట రోడ్డులో కాల్వ గట్టున పడేసిన ఖాళీ బొండాలు

కాకినాడ క్రైం: నగరంలో డెంగీ తగ్గేదేలే అంటోంది. సీజన్ దాటిపోయినా తన ఉనికిని మాత్రం చాటుకుంటోంది. పారిశుధ్య నిర్వహణ లోపానికి అద్దం పడుతోంది. సాధారణంగా ఏటా జూన్ నుంచి అక్టోబర్ వరకు డెంగీ కేసుల ఉధృతి ఉంటుంది. అక్టోబర్ తర్వాత డెంగీ కేసుల సంఖ్య క్రమేపీ తగ్గడం పరిపాటి. అందుకు వాతావరణంలోని తేమ రహిత మార్పులు తోడ్పాటునిచ్చేవి. ప్రస్తుతం సీజన్ దాటి సుమారు రెండు నెలలు కావస్తున్నా, అదే ఒరవడి ఇంకా కొనసాగుతోంది. వాతావరణ ప్రతికూలతకు తోడు, పారిశుధ్య నిర్వహణ లోపం కూడా కారణమవుతోంది.

సీజన్ ముగిసినా...

సీజన్ ముగిసినా డెంగీ డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. ప్రజలతో సహా అధికారులు హమ్మయ్య అంటూ నిట్టూర్చే వేళ నేను వెళ్లలేదంటూ డెంగీ తన ఉనికిని చాటుతోంది. దాదాపు సీజన్ దాటి రెండో నెలా ఉధృతిని కొనసాగిస్తోంది. ఈ పరిస్థితిపై వైద్య వర్గాల్లో ఆందోళన నెలకొంది. గతంలో ఏనాడు ఈ పరిస్థితి లేదు.

ఎందుకిలా..!

డెంగీ కేసులు నగరాన్ని బెంబేలెత్తించడానికి ప్రధాన కారణం పారిశుధ్య నిర్వహణ లోపమే. వాతావరణం ఎక్కువ శాతం తేమగా ఉండడం, వర్షాలు కురవడం, అందుకు తగ్గ రీతిలో పారిశుధ్య నిర్వహణ లేదు. మున్సిపల్ విభాగాలు, సచివాలయ అనుబంధ శానిటరీ సెక్రటరీలు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించడం ప్రజల పాలిట శాపంగా మారింది. డెంగీ కారకాలపై ఏ మాత్రం దృష్టి సారించడం లేదు. నీటి నిల్వలు, తాగి పడేసిన కొబ్బరి బొండాల తొలగింపు డెంగీ కారక అడిస్ దోమల ఉత్పత్తికి ప్రధాన కారణాలు.

పడకేసిన పారిశుధ్యం

నగరంలో పారిశుధ్యం పడకేసింది. ఏ మూల చూసినా దోమల ఉధృతి పెరిగిపోయింది. ఉదయం వేళల్లోనూ కుట్టి ముప్పు తెస్తున్నాయి. రోడ్లపై గోతుల్లోనూ నీరు నిల్వ ఉంటుందంటే, ఏ స్థాయికి పారిశుధ్య నిర్వహణ దిగజారిందో స్పష్టమవుతోంది. కాకినాడ నుంచి సామర్లకోటకు వెళ్లే మార్గమైతే మరీ దారుణంగా ఉంది. అక్కడ రోడ్డు పక్కనే కొన్ని వేల కొబ్బరిబొండాలు పడేస్తున్నారు. వీటిలో డెంగీ దోమ పెరిగి, వ్యాధిని వ్యాప్తి చేస్తోంది. కొబ్బరిబొండాలను ఇంటి ఆవరణల్లో ఉంచకుండా వైద్యాధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ఈ బొండాలు రెండు లేదా నాలుగు ముక్కలు చేసి, ఇతర పీచును కుషన్‌గా, మిగిలిన అవశేషాన్ని వంట చెరకుగా వినియోగించుకునే అవకాశం ఉన్నా, ఏ మాత్రం పట్టింపు లేకుండా అలాగే కుళ్లబెట్టి విషజ్వరాల కారక దోమలను పెంచి పోషిస్తున్నారు.

వైద్యారోగ్య శాఖ చర్యలు

డెంగీ కారక దోమల నివారణకు వైద్యారోగ్య శాఖ నగర విభాగం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా ఫ్రైడే డ్రైడే నిర్వహిస్తున్నామనీ, ఫాగింగ్, గంబూజియా చేపలను నీటి వనరుల్లో విడిచిపెట్టడం, కొబ్బరిబొండాలు, టైర్లలో నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు చేపట్టడం, ఇళ్లల్లో ఫ్రిజ్ వెనుక, చెంబులు, వినియోగించని నీటి పాత్రల్లో నిల్వల వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కలిగించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు.

సమన్వయ లోపం

వెక్టర్ హైజీన్ యాప్ ద్వారా పారిశుధ్య నిర్వహణ సమన్వయ లోపంతో అభాసుపాలవుతోంది. వైద్యారోగ్య శాఖ క్షేత్ర స్థాయి సిబ్బంది తమ యాప్‌లో అపరిశుభ్రతకు సంబంధించిన ఫొటోలు అప్‌లోడ్ చేస్తే, వాటి ఆధారంగా సచివాలయ పరిధిలోని పారిశుధ్య సిబ్బంది ఆయా ప్రదేశాలకు వెళ్లి పారిశుధ్య చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ఈ పని కూడా కష్టంగా భావిస్తూ, కేవలం ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్న ఏఎన్ఎంలతో కొందరు సిబ్బంది వాదులాడుతున్నారు. ఈ తీరు ఆయా శాఖల్లో తలనొప్పిగా మారింది.

278 మందికి డెంగీ!

ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి జిల్లావ్యాప్తంగా 278 డెంగీ కేసులు నమోదైతే, అందులో కాకినాడ అర్బన్, గ్రామీణ మండలాల్లో 140 కేసులున్నాయి. గతేడాది నమోదైన కేసుల సంఖ్య 109 కాగా, అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య 11 నమోదయ్యాయి. ఈ ఏడాది అక్టోబర్ నుంచి డిసెంబర్ 18 వరకు 32 కేసులు నమోదైనట్టు గణాంకాలు చెబుతున్నాయి.



డెంగీ ప్రభావిత ప్రాంతంలో చేస్తున్న ఫాగింగ్



ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న అధికారులు

పరీక్షలు పెంచాం



డెంగీ నివారణే లక్ష్యంగా డీఎంహెచ్‌వో పర్యవేక్షణలో వివిధ చర్యలు చేపడుతున్నాం. అందులో భాగంగా డెంగీ టెస్ట్‌లు పెంచాం. బాధితుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. డెంగీ గుర్తించిన ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. చుట్టుపక్కల ఉన్న 50 ఇళ్లలో ఫీవర్ సర్వే సహా, డెంగీ పరీక్షలు చేస్తున్నాం. లార్వాను అంతమొందించేందుకు ఆయిల్ బాల్స్ సహా ఇతర చర్యలు చేపడుతున్నాం. డెంగీ ప్రాంతాల్లో ఫాగింగ్ చేస్తున్నాం. వెక్టర్ హైజీన్ యాప్ ద్వారా పారిశుధ్య నిర్వహణపై పర్యవేక్షణ కొనసాగుతోంది.

– డాక్టర్ పి.రవికుమార్, డీఎంవో, కాకినాడ జిల్లా

మత్స్యవతారంలో సీతారామస్వామి



బోట్‌క్లబ్: నగరంలోని మెయిన్‌రోడ్డులో ఉన్న సీతారామస్వామి ఆలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా తొలి రోజు బుధవారం స్వామివారు మత్స్యవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి ఆలయ అర్చకులు ఉదయం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ప్రత్యేకాలంకరణలో వేణుగోపాలస్వామి



బోట్‌క్లబ్: ధనుర్మాస వ్రత మహోత్సవాలు, రజిత అలంకార ఉత్సవాల్లో భాగంగా స్థానిక దేవాలయం వీధిలో ఉన్న రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారు మత్స్యవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారికి ఆలయ అర్చకులు పొందూరు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కాకినాడ సిటీ: మితిమీరుతున్న సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై కార్మికులు అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందని పోలీసు అధికారులు తెలిపారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు ఎస్ రమేష్, డి.రామారావు, వన్ టౌన్ లాఅండ్‌ఆర్డర్ ఇన్‌స్పెక్టర్ ఎం దుర్గారావు కలిసి బుధవారం డీప్ వాటర్ పోర్టు, యాంకరేజ్ పోర్టు వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు అవగాహన కల్పించారు. వివిధ రకాల సైబర్ నేరాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వీడియోలు, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ల ద్వారా వివరించారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మోటారు సైకిల్ నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. హెల్మెట్ ధరించకపోతే జరిగే నష్టాలు, ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్, మైనర్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కలిగే జరిగే ప్రమాదాలపై వివరించారు. సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 1930కి, సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలు, ఫేక్‌లోన్ మోసాలు, ఆన్‌లైన్ జాబ్స్, వర్క్స్, డిజిటల్ అరెస్ట్ 112/100, 1930, 1972 కాల్స్ ఉపయోగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సైలు పి.కిశోర్‌కుమార్, బి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

గాంధీభవన్ స్థాపనలో తనికెళ్ల పాత్ర కీలకం

బోట్‌క్లబ్: గాంధీజీ పిలుపు మేరకు ఆయన ఆశయ సాధనలో భాగంగా గాంధీభవన్ స్థాపించడంలోను, బలహీన వర్గాల అభ్యున్నతికి తనికెళ్ల సత్యనారాయణమూర్తి ఎనలేని కృషి చేశారని పలువురు వక్తలు కొనియాడారు. గాంధీభవన్ వ్యవస్థాపకులు తనికెళ్ల సత్యనారాయణమూర్తి జయంతి వేడుకలు బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గాంధీభవన్ అధ్యక్షుడు వీఎల్ గాంధీ, కార్యదర్శి వక్కలంక రామకృష్ణ, సహాయ కార్యదర్శి వైఎస్ వీఎస్ మూర్తి తనికెళ్లతో తమకున్న అనుబంధాన్ని వివరించారు. పిఠాపురంలో తనకున్న భూమిలో ఐదు ఎకరాలు విక్రయించి కాకినాడ గాంధీభవన్‌కు స్థలాన్ని సమకూర్చారన్నారు. దీనిలో అనేక సాంస్కృతిక, సంస్కరణ కార్యక్రమాలు నిర్వహించారన్నారు. అటువంటి మహనీయుల జీవితాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీభవన్ కార్యవర్గ సభ్యులు వి సత్యనారాయణ, అల్లూరి సురేంద్ర, ఎంవీ భరతలక్ష్మి, ప్రొఫెసర్ దోనగిరిరావు పాల్గొన్నారు.



తనికెళ్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

అపూర్వ కలయిక

బోట్‌క్లబ్: నగరంలోని గంజాంవారి వీధిలో ఉన్న నెహ్రూ కాన్వెంట్ యూపీ స్కూల్ 1988-89 ఏడో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం ఆనందోత్సాహాలతో సాగింది. స్థానిక తిలక్‌వీధిలోని వెండి, బంగారం, డైమండ్స్ వర్తక సంఘం కల్యాణ మండపంలో జరిగిన ఈ అపూర్వ కలయికలో పాత స్నేహితులు తమ మధుర జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థులు సాయిరామ్, మురళీ, రమణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫణి భాస్కర్ వ్యాఖ్యతగా ఆలరించారు. అలనాడు పాఠాలు చెప్పిన గురువులు బాల, తులసి, సత్యవేణి, సుబ్బలక్ష్మిని సత్కరించారు. నాయకమ్మ, శశికళ ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

వ్యక్తిపై చాకుతో దాడి

కొత్తపల్లి: అతి వేగంగా వెళ్లవద్దని చెప్పినందుకు ఓ వ్యక్తిపై మోటారు సైకిలిస్టు చాకుతో దాడి చేశాడు. పిఠాపురం మండలం బి.కొత్తూరుకు చెందిన సున్నంశెట్టి వీరాంజనేయులు మంగళవారం రాత్రి మోటార్ సైకిల్‌పై వేగంగా వెళుతున్నాడు. అదే గ్రామానికి చెందిన బేతాళ వెంకన్న కాస్త నెమ్మదిగా వెళ్లాలని మందలించాడు. దీంతో వీరి మధ్య ఘర్షణ జరగ్గా, వెంకన్నపై వీరాంజనేయులు చాకుతో దాడి చేశాడు. బాధితుడిని స్థానికులు పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా..వీరిద్దరూ పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

కుల వివక్ష రూపుమాపాలి

బోట్‌క్లబ్: దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న కుల వివక్షను రూపుమాపాలని దళిత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. కుల రక్కసిని ప్రేరేపించే మనుధర్మ శాస్త్రాన్ని అంబేడ్కర్ వ్యతిరేకించి దగ్ధం చేశారన్నారు. ఈ నేపథ్యంలో మను ధర్మశాస్త్ర దగ్ధ దినోత్సవాన్ని బుధవారం సామాజిక న్యాయ సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షురాలు భానుమతి, మాట్లాడుతూ, మనుధర్మ శాస్త్రం అట్టడుగు వర్గాల వారిని మరింత దిగజార్చే విధంగా ఉందన్నారు. దీనిని ఆనాడే అంబేడ్కర్ వ్యతిరేకించి దగ్ధం చేశారన్నారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం మనుధర్మ శాస్త్రం ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, సిద్ధాంపు కొండబాబు, పిట్టా వరప్రసాద్, తాడి బాబ్జి పాల్గొన్నారు.



ప్రతులను దహనం చేస్తున్న సమితి సభ్యులు

అంబరాన్నంటిన క్రిస్మస్ సంబరాలు

- కిటకిటలాడిన చర్చిలు
- పేదలకు నూతన వస్త్రాల పంపిణీ



గొర్రిపూడిలో కొవ్వొత్తులు ప్రదర్శిస్తున్న క్రైస్తవులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): ఊరూవాడా క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. క్రైస్తవులు క్యాండిల్ సర్వీస్‌లో కొవ్వొత్తులు వెలిగించి క్రీస్తును ఆరాధించారు. చర్చిలలో క్రీస్తు పశువులపాకలో పుట్టిన దృశ్యాలను నాటిక రూపంలో ప్రదర్శించారు. లూథరన్, బాప్టిస్టు, రోమన్ కేథలిక్, మన్నా మిషన్, బైబిల్ మిషన్, బెయెర్షబా, ఏసు ప్రేమాలయం తదితర శాఖల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. రోమన్ కేథలిక్ శాఖ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు మంగళవారం రాత్రి నుంచే ప్రారంభమయ్యాయి. లూథరన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రేమవిందులో చర్చి సభ్యులు తమ కుటుంబ సమేతంగా ఉత్సాహంగా పాల్గొన్నారు. తాళ్లరేవు ఆంధ్రా బాప్టిస్టు చర్చి, కాకినాలోని జగన్నాథపురం చర్చిస్కేర్ సెంటర్‌లోని ఆంధ్రా బాప్టిస్టు, రోమన్ కేథలిక్, హౌస్ ఆఫ్ ప్రేయర్, క్రేగ్ ఇమ్మానుయేలు, క్రేగ్ మెమోరియల్ చర్చి, రిజర్వు పోలీస్ యూనియన్ బాప్టిస్టు చర్చి, ఏపీఎస్పీ యూనియన్ బాప్టిస్టు చర్చి, రామారావుపేట లూథరన్ చర్చి క్రిస్మస్ వేడుకల్లో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నగరంలో జరిగిన వేడుకల్లో కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జి.జోసఫ్ బెన్ని, అధ్యక్షుడు డీజీ శామ్యూల్ సాగర్, సాధారణ కార్యదర్శి డాక్టర్ శీరం ఐజాక్, ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి డాక్టర్ శామ్యూల్ విక్టర్, ఉపాధ్యక్షుడు మడికి జోయల్ రాజు, కోశాధికారి డాక్టర్ పి.సురేంద్రకుమార్, సంయుక్త కోశాధికారి డాక్టర్ ఎం.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో క్రిస్మస్ వేడులు జరిగాయి.

ప్రత్యేక ఆరాధన

క్రిస్మస్‌ను పురస్కరించుకుని అన్ని చర్చిల్లో ప్రత్యేక ఆరాధన నిర్వహించారు. ప్రత్యేక అతిథులు క్రిస్మస్ సందేశం వినిపించారు. కొన్ని చర్చిల్లో క్యాండిల్ సర్వీస్ నిర్వహించారు. పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

క్రీస్తు రాకకు తపించిన హృదయాలు

కాకినాడ రూరల్: కరుణామయుడు, లోక రక్షకుడు ఏసు ప్రభువు రాక కోసం ప్రత్యేక ప్రార్థనలతో ప్రార్థన మందిరాల్లో క్రైస్తవ హృదయాలు తపించాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొవ్వొత్తులతో ప్రదర్శనలు, కేక్ కటింగ్‌లు నిర్వహించారు. రమణయ్యపేటలోని బెరాకా బ్లెసింగ్ చర్చిలో పాస్టర్లు జోసెఫ్ బెన్నీ, మోజెస్ బెన్నీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు, రమణయ్యపేట ఏపీఎస్పీ వద్ద రెస్ ఆఫ్ పీస్ వర్షిప్‌లో రెవ. మూర్తి రాజు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ పాల్గొన్నారు. కొవ్వాడ, పండూరు తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.

గ్రామ,గ్రామాన వేడుకలు

కరప: మండలంలోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కరపలోని ఫెయిత్ గాస్పెల్ చర్చిలో బిషప్ డాక్టర్ కె.అబ్రహాం సామ్యూల్, శాంతిబాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ డి.జయప్రకాష్, చర్చి ఆఫ్ క్రైస్ట్ పాస్టర్ డాక్టర్ పి.సామ్యూల్‌రాజు ఆధ్వర్యంలో ప్రార్థనలు చేసి, ఏసు సందేశం వినిపించారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, సాదే లోహిదాస్‌కుమార్ పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. క్రైస్తవులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. చిన్నారులు పాటలు పాడుతూ, నృత్యాలు చేశారు. పేదలకు, వితంతువులకు బిషప్ అబ్రహాం సామ్యూలు పండ్లు, దుస్తులు పంపిణీ చేశారు. గొర్రిపూడిలోని జీసస్ ప్రేయర్ టవర్ చర్చిలో పాస్టర్ జి.జాన్‌ప్రసాద్ సందేశం వినిపించారు. యండమూరు గాస్పెల్ బాప్టిస్ట్ చర్చిలో ఐ.జాన్ సూర్యప్రకాష్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పేదలకు చీరలు పంపిణీ చేశారు.



రమణయ్యపేట బెరాకా చర్చిలో క్రిస్మస్ సందేశం ఇస్తున్న పాస్టర్లు జోసెఫ్ బెన్నీ, మోజెస్ బెన్నీ



కరప ఫెయిత్ గాస్పెల్ చర్చిలో సందేశం వినిపిస్తున్న బిషప్ డాక్టర్ అబ్రహాం సామ్యూల్



ఎల్విన్‌పేట ఆంధ్రా బాప్టిస్ట్ చర్చిలో క్రిస్మస్ పాటలు పాడుతున్న క్రైస్తవులు



గొర్రిపూడి జీసస్ ప్రేయర్ టవర్ చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్ జాన్‌ప్రసాద్



కాకినాడ జగన్నాథపురం గోలీలపేటలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్, క్రైస్తవులు

తటవర్తి సేవలు మరువలేనివి

బోట్‌క్లబ్: మహర్షి సాంబమూర్తి దివ్యాంగుల బాలికల ఆశ్రమ పాఠశాల ఏర్పాటుకు తటవర్తి శ్రీనివాసరావు చేసిన కృషి మరువలేనివని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు అన్నారు. స్థానిక పీఆర్ కళాశాల వద్ద బుధవారం తటవర్తి జయంతి కార్యక్రమం నిర్వహించారు. నగరంలో పరివర్తన వీధి బాలల ఆశ్రమం, వికలాంగ ఆశ్రమం వంటి సంస్థల ఏర్పాటులో ఆయన ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పలు సందర్భాల్లో వివాదాలుగా ఏర్పడిన అనేక ప్రజా సమస్యల పరిష్కారానికి వారధిగా నిలిచారన్నారు. సామాజిక విషయాల అధ్యయన సంస్థ ప్రతినిధిగా జిల్లా అధికార యంత్రాంగానికి తోడ్పాటు అందించారని గుర్తు చేశారు. కాకినాడ నగరంలో కొత్తగా ఏర్పాటు చేసే రహదారికి ఆయన నామకరణం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పట్నాల గోవిందు, నీలగిరి మాధవశర్మ, మహ్మద్ ఇబ్రహీం జాన్ పాల్గొన్నారు.

వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయం



నడకుదురులో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కరప: మండలంలోని నడకుదురు గ్రామంలో బుధవారం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు రెడ్డి రమణేశ్వర్ ఆధ్వర్యంలో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం రమణేశ్వర్ మాట్లాడుతూ, దేశ ప్రగతికి వాజ్‌పేయి చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. పార్టీ నాయకులు రొంగలి సన్యాసిరావు, చిటిమిరెడ్డి గోవిందు, తుమ్మలపల్లి గోవిందు, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.